



# అక్కఈగ

పి. ప్రతిమ

**అబ్బ! యిప్పుడు నాక్కొంత రిలీఫ్‌గా వుంది... నా తల, వీపు, నడుము, కాళ్లు ఈ మంచం మీద ఆనిన తరువాత, ఈనెల రోజులుగా నేను పడుతుండిన శారీరక బాధంతా ఎక్కడికో ఎగిరిపోయినట్లుగా ఒకింత తేలిగ్గా వుంది...**

సంజీవనీ పర్వత సానువుల్లో నిలబడి మరణాన్ని పిలుస్తున్నట్లు ఆనందంగా వుంది... మరణమంటే...? ఎవరో అన్నట్లుగా రెండు జన్మల నడుమ నిద్రా?... నిద్ర... నిద్ర హాయిగా నిద్రపడితే ఎంత బావుంటుంది?... పట్టదు.... ఎందుకు పట్టుంది మనసూ, శరీరమూ యమ యాతనపడ్తూంటే మనిషికెక్కడయినా నిద్ర పడ్తుందా?... మరి మనిషికెప్పుడు నిద్రపడ్తుంది?... పక్కింటి లక్ష్మి ఎంత హాయిగా నిద్రపోతున్నట్లుగా వుంది?... అసలు లక్ష్మి నిజంగా మరణించిందా? అంతా కలలా వుంది... అప్పటిదాకా బాగా మాట్లాడి వెళ్లిన లక్ష్మి అరగంట తరువాత శవమై కన్పించినపుడే కదా జీవితానికీ, మరణానికీ నడుమ వ్యత్యాసం సన్నగా వున్నట్లు అర్థమైంది... తనకి.

జీవితమంటే ఏమిటి?... అవును ఈ మంచం మీదే తొలిసారిగా తనకి జీవితమంటే ఏమిటో కొంత తెలిసింది... అప్పటిదాకా నిజంగా తనకి ఏమీతెలీదు... జీవితమంటే రంగురంగుల రమ్యమైన సీతాకోకచిలుక... జీవితమంటే అరవిరిసిన పూలతోట... జీవితమంటే చదువు, ప్రేమ, స్నేహం, ఆర్తి, ఆత్మీయత, కబుర్లు, నవ్వులు... అలా ఎగురుకుంటూ వచ్చి సీతాకోక చిలుక అందంగా ఈ మంచం మీద వాలింది... చాలాకాలం తరువాత తిరిగి చూసుకుంటే దాని రెక్కలు తెగ్గొట్టబడ్డాయి. అయ్యో రెక్కలు విరిగిన సంగతే తెలీనంత సమ్మగా.... అరెరె తను గమనించనేలేదే... అప్పుడెప్పుడో భరించరాని నొప్పేస్తే పోనీలే అని సర్దుకుంది, సరిపెట్టుకుంది... ఒక్కసారా తనకి నొప్పేసింది?... ఒక్కొక్కసారీ సరేననుకుంది. అప్పుడే విరిగిపోయుండాలి రెక్కలు...

ఇదంతా తనదే అనుకుంది. అసలెవరూ పరాయి వాళ్లు లేరనుకుంది. పరాయి వాళ్లెవరు? ఒకరిలో ఒకరికి రక్తం కలిసిపోయాక ఎవరయినా పరాయివాళ్లవుతారా?... అవునూ రక్తం మనుషుల్ని కలుపుతుందా? మరి... శరీరాలు కలుపుతాయా?... మనసు కలుపుతుందా? అభిప్రాయాలు? వాటినెక్కడ పాతిపెడదాం?... వాటిని పాతి పెట్టడమంటే మనుషుల్ని పాతిపెట్టడమే కదా... మనుషుల్ని ఎక్కడ పాతిపెడతారు? స్మశానంలోనా? స్మశానంలో ఒంటరిగా వుండాలంటే భయమేయదూ? ఛ...ఛ... అక్కడ మనుషులుండరు.

భయమెందుకు? వేస్తే గీస్తే యింట్లోనే వేయాలి... ఈ యింట్లో... ఈ యిల్లు తనెంత కష్టపడి కట్టుకుంది?... రెక్కలు ముక్కలు... ముక్కలెప్పుడో గాలి కెగిరిపోయాయి. ఇల్లు కావాలని తను... వద్దని అతడు... అసలు ఆలోచనలూ, అభిప్రాయాలూ కలిసిందెన్నడు? ఆ వైరుధ్యంలోనే తండ్రినడిగి కొంతా, ఆ లోనూ, ఈ లోనూ పెట్టి కొంతా అల్లాడల్లాడి ఈ కప్పేసుకుంది... తన రక్తంతో కట్టుకుందీ యిల్లు.

మనుషులెందుకిటువంటి పిచ్చి పనులు చేస్తారో అర్థంకాదు... సొంత ఆస్తి వుండడానికీ, పోవడానికీ నడుమ జరిగే సంఘర్షణ గురించి మార్క్స్ ఎంత బాగా చెప్తాడు? మార్క్స్‌ని చదువుకుంటాం... ఎంగెల్స్‌ని చదువుతాం... వర్గపోరాటాల గురించి వైనవైనాలుగా తెలుసుకుంటాం... అయినా సరే సొంత యిల్లూ... ఆ యింటికి రెండు గేట్లూ... ఒకటి మనుషుల కోసం...

రెండోది వాహనాలు నడవడానికీ.. అన్నీ తెలుసుండీ బుద్ధి లేకుండా అందరి మనుషుల్లాగే కప్పేసుకుంది... ఇల్లంటే యిష్టమే మరి... యింట్లోని మనుషులంటేనో... మనుషులు... మనసులు... మనసులు... వర్గాలు... ఈ యింట్లో మనుషులు కాదు... మొత్తం మాటలే... మాటల సూదులు, శూలాలు... మనిషికి మనసుందనేది తెలీని మనుషులు.

చెప్పులోని రాయి, చెవిలోని జోరిగా... కాలిలోని ముల్లు, యింటిలోని పోరు వెర్రిబాగులోడు ఎంత బాగా చెప్పాడు? పోరు... పోరు... ఎక్కడ చూసినా పోరే... ఉదయం లేస్తే పాలున్నాయో లేదో చూసుకుని కాఫీ కలిపే లోపలే ఒక పోరు... గ్యాస్ అయిపోయిందంటే ఒక పోరు... కూరలో ఒకింత ఉప్పు తక్కువయినా, ఎక్కువయినా పోరే... చీకట్లో నిద్రలేస్తే పక్కలోకి తక్కువని పోరు... నిద్ర లేవకపోతే కంచంలోకి తక్కువని పోరు...

ఇంటికి స్నేహితులొస్తే, వాళ్ల ముందుకొస్తే ఒక పోరు... రాకుండా వంటింటికతుక్కుపోతే మరో పోరు... అంతా వెరసి తను ఉద్యోగస్తురాలు కాదనేది మొదటి పోరు... ఉదయం పడక మంచం మీది నుండి లేచింది మొదలు రాత్రి తిరిగి మంచమెక్కే వరకూ కూడా పోరాటమే... ఒంటరి పోరాటం... మౌన పోరాటం.

ఛ... ఛ... స్వేచ్ఛగా, హాయిగా, గునగునా పరుగులెత్తుతూ తిరిగే కుందేలికి తనతో కంపారిజనేమిటి?... సిగ్గు... సిగ్గు... కుందేలు సిగ్గుపడుతోంది. తనని ఆడదానితో పోల్చినందుకు... ఆ మాటకొస్తే ఈగ కూడా సిగ్గుపడి ఎగిరిపోతోంది.

ఎక్కడెగుర్తోంది పిచ్చి ఈగ... తెలిసి తెలిసీ వచ్చి శ్లేష్మంలో పడ్తోంది. లేకుంటే తన చెల్లిఈగ ఎలా చిక్కుకుంది... చెల్లిఈగయినా, అక్కఈగయినా సరే మగ గాలంలో చిక్కుకు తీరాల్సిందే... యిదే మంచం మీద తన చెల్లెలు డేగ గాలంలో తగులుకుంది... ఆ నిజాన్ని కళ్లారా చూసినపుడే కదా జీవితమంటే యింకా యింకా బాగా అర్థమయిపోయింది తనకి... మనసు ఆలోచించడం అలవాటు లేనిదానిలా మొద్దుబారిపోయింది... జీవితం అంటే యిప్పుడు గుండ్రాళ్ల మీద గలగలపారే సెలయేరు కాదు... చుట్టురా వేయి నాల్కలు చాస్తోన్న జ్వాల.

చెల్లిఈగ నిజంగా సుభాషిణే... భాషణమే భూషణం దానికి. అందంలో ఎవరికెవరూ తీసికట్టు కాకపోయినా అది కెరీర్ఈగ... పదిరాళ్లు సంపాదిస్తోంది... ప్రస్తుతం మగాడిక్కావల్సిందదే. కెరీర్ వుమెన్... మేధావియై తన తిరుగుళ్లనీ, తాగుళ్లనీ పరిపూర్ణంగా అర్థం చేసుకోగల్గిన భాగస్వామి... ఆ మేధావితనం బయటివాళ్లకి చూపించుకోవడానికీ తప్ప మళ్లీ తన ముందు ప్రదర్శించకూడదు... కూడదంటే కూడదంతే... ఒకవేళ పొరపాటున అప్పటికే కెరీర్‌లెస్, విసడమ్‌లెస్, టాలెంట్‌లెస్ ఆడదాన్ని భాగస్వామిగా పొంది వున్నట్టయితే.... మరో కెరీర్ఈగని తన జీవితంలోకి ఆహ్వానించే హక్కు కలిగి వుంటాడిక్కడ మగాడు... చట్టాలు చట్టాలుగానే వుంటాయి. కాగితాల్లో... సెక్షన్లు చెక్కభజన చేస్తుంటాయి. ఏ వ్యక్తి అయినా తొలి వివాహబంధాన్ని కొనసాగిస్తూనే రెండో వివాహం చేసుకుంటే ఆ వివాహం చట్టబద్ధం కాదు అంటాయి కాగితాలు... చట్టబద్ధమైతే ఎంత? కాకపోతే ఎంత?... పదిహేనేళ్లుగా వివాహం కొనసాగుతూనే వుంది.

అవునూ ఆడదెందుకు రెండో పెళ్లి చేసుకోకూడదు.... కూడదని ఎవరు చెప్పారు? మగాడే చెప్పి వుండాలి... ఇద్దరు మగాళ్లతో కాపురం చేస్తే ఎలా వుంటుంది? ఛ... ఛ... అటువంటి అవకాశం స్త్రీకుండకూడదు.

ప్చ్. ఆడదానికి అసలేముంది కనక యిక్కడ?.... ఏం లేకపోయినా బతకాల్సిందే... ఏం లేకపోయినా... ఏది లేకపోతే? ప్రేమ లేకపోయినా, ఆప్యాయత లేకపోయినా మాటల్లేకపోయినా... ఆఖరికి మొగుడు దగ్గరికి తీసుకోకపోయినా... ఏ సుఖమూ లేకపోయినా సరే.... యిదంతా నా ఖర్మ, నాకిట్టా రాసిపెట్టుంది అని పదేపదే అనుకుంటూ అయినా సరే బతకాల్సిందే... కనీసం చావడాని క్కూడ వీలుండదంతే.

ప్రేమ?... అదెక్కడుంది?... సమాజంలో సంపాదనస్థాయిని బట్టీ స్త్రీ పురుష సంబంధాలుంటాయి... ఆ సంబంధాల్ని బట్టీ ప్రేమ నిర్వచించబడుతుంది. మన కుటుంబాల్లో దాని జాడే లేదు... ఇక్కడ ఏ మొగుడూ పెళ్లాన్ని ప్రేమించడంలేదు... ఒకవేళ పెళ్లాం ప్రేమించినా అది భద్రతకోసమో, లేక సమాజం కోసమో నటన... నటన...

నరుడి బతుకు నటనా... మొగుడి ప్రేమ నటనా...
ఆ రెండి నట్టనడుమా నీకెందుకంత తపనా...

తపన...తపన... ఈ శరీరానికెందుకంత తపనగా వుంటుంది? తపన... తపన... అవునూ? మొగుడెందుకు దగ్గరికి తీసుకోడు?... దానికి సవాలక్ష కారణాలు చెప్తాడు సమరం... అసలు వాత్స్యాయనుడేం చెప్పాడో తెలీకపాయ సమరం చెప్పిందే వేదం... ఏం.... అతను మాత్రం పెళ్లానికి సుఖమివ్వొద్దన్నాడా?

చెల్లిఈగ మంచమెక్కిన్నాటి నుండీ తనే అతన్ని పన్నెత్తి పలకరించలేదు... ఆ తర్వాత తనకి తాను సరిపెట్టుకుని తపనగా అతడికి దగ్గరవాలని చూస్తే అతడు కన్నెత్తి చూడలేదు... అసలు తనకి తెలీకడుగుతుంది కానీ పెళ్లాన్ని వేధించి, రేప్ చేసే మగాళ్లని గురించి తెగ రాసేస్తుంటారు కానీ, మొగుడ్నుంచి సుఖం లేక, మరో మగాడితో పంచుకోవడం యిష్టంలేకో, అవకాశం లేకో అల్లాడిపోయే ఆడదాన్ని గురించి ఒక్కడూ రాయడేం?... ఆ ఆడదానికెందుకులేబ్బా సుఖం?... మనకుంటే చాల్లే... శక్తి లేకపోయినా సరే ఓజోమెన్లూ, వయాగ్రాలూ రెడీగా వుంటాయి... ఒంట్లో శక్తి లేకపోతే సరే మనసుకి శక్తి లేకపోతే ఏం మింగించాలి? వాడు వద్దనుకుంటే వద్దే... వాడి చేత ఏమీ మింగించలేం... అంతగా అయితే ఆవిడెవరో అన్నట్లు మనసింకిపోవడానికి తనే మాత్ర వేసేసుకుంటే సరిపోతుంది. ఎన్ని నిద్రలేని సుదీర్ఘ రాత్రులు ముండ మోసినదానిలా బతికింది తను... సమరాన్నడిగి విషం (?) మింగుండాల్సింది...

అసలీ ఆడముండలకి బొత్తిగా బుద్ధిలేదబ్బా?... ప్రపంచంలో మరెక్కడా మగాడే దొరకనట్లు సెకండ్ హ్యాండ్ మగాడ్ని తగులుకుంటారెందుకో? ఎంత చదువులుండి, వూళ్లేలుతుంటే మాత్రం ఏం లాభం?... ఆడదాని ఆలోచనలు ఆ స్థాయిలోనే వుంటాయి. మంచి అందమైన, చదువుకున్న, ఢిల్లీలో పెద్దకేడర్లో వున్న వరుడ్ని మాట్టాడాడు తన తండ్రి... ఈలోపుగా చెల్లి ఈగ వీడ్ని తగులుకుంది... తండ్రికి తెలీకుండా పెళ్లి కూడా చేసేసుకుంది... ప్చ్ ఎవరి జీవితమార్గాన్ని ఎవరు మళ్లించగలరు? ఈ సెకండ్ హ్యాండ్ మనిషిలో ఏం సుఖం చూసిందో మరి? మళ్లీ ఏదయినా గట్టిగా మాట్లాడితే తనకి అసూయంటుంది.

అసూయేంటే పిచ్చి మొహమా?... నన్నూ చేసుకొని, నిన్నూ చేసుకుని వాడు సుఖపడిపోతున్నాడే అన్ని విధాలా... నువ్వు డబ్బు సంపాదించి పెడ్తావు, అన్ని ఆడంబరాలకీనూ... షోగ్గా అలంకరించుకుని పార్టీలకూ, ఫంక్షన్లకూ వెళ్తావు వాడితో కలిసి... అక్కడ పనికిమాలిన మేధావులందరితోనూ అస్‌బీస్ మంటూ యింగ్లీషులో మాట్లాడేస్తావు... ఇంకా వీలయితే అతడి పై ఆఫీసర్స్‌తో చనువుగా మెసిలి ప్రమోషన్ సంపాదించిపెట్టగలవు... ఇకపోతే నేనో... యింట్లోనే వుండి హాయిగా యిల్లంతా సర్దిపెడ్తాను. ఒక చిన్న వస్తువయినా బయటికి పోకుండా కాపలా కాస్తాను. మీరొచ్చేసరికి కమ్మగా వండి పెడతాను... నువు బయటా, నేనింట్లో హాయిగా కూర్చోబెట్టి మేపుతున్నామే వాడ్ని అంటే అర్థంకాదేమే నీకు? ముందు నువ్వే అసూయలో పడి కొట్టుకుపోతూ నన్నర్థం చేసుకోకపోతిని... ప్చ్ నువ్వా అవకాశం యివ్వబట్టేకదా, మనిద్దర్నీ కీలుబొమ్మల్ని చేసి ఆడించాడు. కీలుబొమ్మ... బొమ్మ... మూగబొమ్మ... ఒక బొమ్మకి ఏ కీలుకాకీలు వూడగొట్టేశాడు... ఊపిరి మాత్రం ఎక్కడో కాస్త ఆడుతోంది... అది కూడా రేపో, మాపో ఆగిపోతుంది... ఆగిపోవాల్సిందే అంతే... అన్ని సినిమాల్లోనూ అదే కదా చూపెడ్తారు. చిన్నిల్లో, పెద్దిల్లో ఏదో ఒకటి అంతమవ్వాల్సిందే. అదే ఎండింగ్... యిద్దరు పెళ్లాలతో చివరిదాకా థ్రిల్లింగా, సుఖంగా, ఎంజాయింగ్‌గా చూపించేసి చివరాఖరికి మాత్రం ఒకదాన్ని లేపేస్తాడు... లేదా దూరంగా పంపేస్తాడు... ఆసలెందుకెళ్లాలి! హీరోనే లేపేస్తే పోలా? అమ్మో సినిమా ఆడదు... అయ్యేమి సినిమాలో, ఎత్తుభారాలో అర్థమేకావడంలేదు... నారీ నారీ నడుమ మురారి, ఏమండీ ఆవిడొచ్చిందీ, ఎదురింటి మొగుడూ... పక్కింటి పెళ్లాం, ఆవిడా మా ఆవిడే... అబ్బబ్బ... ఈ యిద్దరు హీరోయిన్ల సినిమాలు చూసి చూసి అదే యిప్పటి సంస్కృతి అన్నట్లుగా మారిపోతోంది యువతరం.

ఆ సంస్కృతితోనే చిన్నాన్న కూతురు వసుమతి ముందే పెళ్లామున్న మగాడ్ని తెలిసో, తెలీకో ప్రేమించేసింది... ఛ... ప్రేమన్న పదానికీ నిర్వచనం మారిపోయిందీ తరంలో... వాడ్ని పెళ్లి చేసుకోమని అడిగితే నాకు పెళ్లయింది, కావాలంటే నిన్నుంచుకుంటాను అన్నాడట... ఆ రాత్రే కిరసనాయిలు డబ్బా ఖాళీ చేసేసింది వసుమతి... అబ్బ చావాలనుకుంటే మరో మార్గమే లేదా? అంత దారుణంగా మంటల్లో పడి చావాలా? అబ్సర్డ్... ఏం వాడికి రెండో పెళ్లాంగా పడుండకపోతే త్ఫూ... ఎదవ నాయాల అని వుమ్మేసి హాయిగా వేరేవాడ్ని పెళ్లాడగూడదూ... అహ ప్రేమ... ప్రేమించేసింది.... వాడే కావాలి... వాడొద్దంటే మరణమే శరణ్యం... రెండో చేయి మనుషులు రెండో చేయి మనుషులని ఛీ... ఛీ...

అరెరె ఎప్పటెప్పటివో సంఘటనలు యింత క్లియర్‌గా జ్ఞాపకానికొస్తున్నాయేమిటి... తనకి బాగయిపోతోందా?... నెలరోజులుగా హాస్పిటల్లో పడుండి యింటి కెళ్తేనయినా గాలి మార్పొస్తుందని వచ్చేస్తే... అయ్యో ఈ మంచం మీదికొచ్చాక కొంత తేలిగ్గా వుందేమిటి?... గాలి మారిపోయిందా? అంటే తను చచ్చిపోదా? ఊపిరిగదా... అయ్యో జీవితపు పాటలన్నింటినీ

సమాధిలో దాచి వుంచుకున్నానే... సమాధి వరకూ ఎవరైనా చేయిపట్టి నడిపిస్తే బావుణ్ణు. అక్కడ అమ్మ వుండి... తనని ఒళ్లో దాచుకుంటుంది... అమ్మంటే అదేకదా...

అమ్మ రుణం ఎలా తీర్చుకోవాలి... రుణం తీర్చుకోవాలంటే అమ్మ పుట్టాలట... అమ్మ తన కడుపులో పుట్టిందా?... ఊహూ షర్మిల కడుపులో పుట్టింది...

షమ్మీ... షమ్మీ... వస్తావా? నేనెళ్లేలోపుగా వస్తావా తల్లీ?

మమ్మీ... మమ్మీ... నేను నీ పక్కనే వున్నానమ్మా... చెప్తున్నారెవరో వీణలాంటి గొంతుతో... అమ్మా... నీకేమీ అవదమ్మా... నేను నిన్ను నాతోపాటు అమెరికా తీసుకెళ్తాను... అక్కడ పెద్ద డాక్టర్లకి చూపిస్తానమ్మా... వెక్కుతోంది షమ్మీ....

పిచ్చి షమ్మీ నాకేమి లేదని నువు చెప్తే మాత్రం, డాక్టర్లు కీమోథెరపీ గురించి మాట్లాడుకోవడం నేను విన్లేదనుకున్నావా? నాక్కూడ కొంచెం కొంచెం తెలుసే తల్లీ... అనుకుంటూ నివి ఏదీ అడిగినట్టుంది తను.

నివీ... నివి బుజ్జీ... రామ్మా అమ్మమ్మ పిలుస్తోంది చూడు అంటున్నారెవరో

మ్మమ్మీ... మ్మమ్మీ... బుజ్జి గొంతు... అబ్బ ఎంత హాయిగా వుంది... వదలి ఎలా వెళ్లాలి... ఏడుస్తున్నారెవరో... ఎవరోకాదు అంతా ఏడుస్తున్నారు.

అక్కా... ఎట్లా వుందక్కా చెల్లి ఈగ వెక్కిళ్లు.

అరెరె ఒకవైపు దిగులు, ఏడుపుతోపాటు చెప్పలేనంత నవ్వొచ్చేస్తోందేమిటి?... నవ్వు... అహ్హహ్హా... నవ్వు నవ్వు... ఎవరో చక్కిలిగింతలు పెట్టినట్లుగా... మనుషులు జీవించి వున్నపుడు చూపించుకోలేని ప్రేమానురాగాలు, ఆత్మీయతానుబంధాలు, చనిపోయేక ఫోటోలు పెట్టి పూజిస్తే మాత్రమేం లాభం? అన్నీ తెలిసీ ఎందుకిలా అజ్ఞానంలో పడుతున్నారు మనుషులు.

అజ్ఞానం అంటే ఏమిటి?

జ్ఞానం లేకపోవడం... ఎరుక లేకపోవడం.

జీవితాన్ని గురించీ, ప్రకృతిని గురించీ, పరిణామాన్ని గురించీ, ఈ సమాజంలోని మనుషుల గురించీ, వాళ్లు మగయినా, ఆడయినా సరే... అసలు మనిషికి తన గురించి తనకే ఎరుక లేకపోవడం.

ఆ ఎరుకనేది ఏర్పడ్డాక అంతా పేలవంగా వుంటుంది.

ఇన్నేళ్లు.... ఏ పొరపొచ్చాలు లేనట్టుగానే.... పైకి ఎంతో గంభీరంగా ఈ జీవితమింతేనని సరిపెట్టుకుంటూ గడిపేసింది కదా... ఇప్పుడెందుకీ బాధ. ఆలోచనలు... తెలివి... చావు తెలివి... అరె యిట్లా చేసి వుంటే బావుండేదే... అట్లా ప్రవర్తించి వుండాల్సిందే అంటూ చర్విత చర్వణం చేసుకుంటోందీ సంధ్యా సమయాన.

జయమ్మా... ఎట్లుందిరా?... అత్తమ్మ పలకరిస్తోంది దయగా... ఆవిడ గొంతులో ఎంతో జాలి, ప్రేమ, ఆర్తి, దిగులు... పాపం ఆవిడా అంతే... తనకి పిల్లలు పుట్టలేదని, గొప్ప త్యాగశీలిలా, గొప్పకుపోయి తన చెల్లెల్ని తెచ్చి మొగుడికిచ్చి చేసిందంట... అటు పెళ్లి చేసి చెయ్యంగానే ఇటు ఈవిడ నీళ్లోసుకుంది... ఈవిడ్ని పుట్టింటికి పంపేసి రెండో పెళ్లాంతో మావగారు ఎంజాయింగు... ఆరునెలలు ఈవిడా, ఆరునెలలు ఆవిడా వంతుల కాపురం... ఛీ...ఛీ... అసహ్యమెయిలేదేమో.

జయమ్మా... తల్లీ మాట్లాడరా...

అత్తమ్మా... మెల్లిగా కళ్లు తెరిచింది తను... నేను వెళ్లిపోతున్నానత్తమ్మా అతి కష్టంగా అన్నట్లుంది.

ఛ... ఛ... అట్ల అనకూడదమ్మా. నా తల్లివి కదూ... నీకు బాగుంటుందిరా... ఇదిగో నీ ఫ్రెండొచ్చింది చూడు శమంత.... చాలసేపట్నుంచీ కాచుక్కూచుంది.

జయా.... జయా మైడియర్ పిలుస్తున్నది శమంత తన చెవి దగ్గరకొచ్చి వెక్కిళ్ల గొంతుతో... బలవంతంగా కళ్లు తెరవడానికి ప్రయత్నిస్తున్నట్టుంది తను... విడివడ్డం లేదు... తెరుస్తోంటే మళ్లీ మూతలు పడిపోతున్నాయి... అబ్బా ఒక్కసారి తెరవాలి... శమంతొచ్చింది... ప్రాణం... తన ప్రాణం... కష్టంలోనూ, సుఖంలోనూ తన హృదయమై స్పందించిన శమంత... ప్రాణమా ఏమయిపోయావే యిన్నాళ్లు? ఆ ప్రైవేటు కాలేజీకి, ఇంటికీ చాకిరీచేసి కండలు కరగబెట్టుకునే క్రమంలో ఈ స్నేహితురాలు గుర్తురాలేదా?... వచ్చే వుంటుంది... అయితే ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్తోందని బహుశా తెలిసి వుండదు.

శమంతా... పెదవులు కదిలాయి...

నిశ్శబ్దంగా వెక్కిపడుతోన్న చప్పుడు... చెవులు బాగానే పని చేస్తున్నాయి... శమంతా... ఎందుకమ్మా ఏడుస్తున్నావు? మాట్లాడినట్టే వుంది తను... మరి దానికి విన్పించిందో, లేదో... శమంత... శమంత... దాని బాల్యం ముంచుముద్దల నడుమ ఎంత దారుణంగా గడిచిందో తనకి బాగానే గుర్తు. దాని తల్లి అతడికి రెండో భార్య. మొదట్లో భార్యా, పిల్లలూ, శమంతా, దాని తల్లీ అంతా కలిసే వుండేవాళ్లు... ఇంట్లో వాళ్ల డామినేషన్ చాలా ఎక్కువగా వుండేది... తండ్రి ఒడిలో కూర్చోవాలన్నా

శమంత జంకేది.... సాధ్యమైనంత వరకూ స్కూల్లోనూ, ట్యూషన్లోనూ, తనతోనే ఎక్కువభాగం బయటే గడిపేసేది. ఎన్నోసార్లు నాన్న తనతోపాటే శమంతకి కూడా ఫీజులు కట్టేవారు... తర్వాత దాని తండ్రి పోయినపుడు నిర్దాక్షిణ్యంగా తల్లీ కూతుళ్లనిద్దరినీ నడిరోడ్డు మీదికి విసిరేశారు వాళ్లు.

ఛ... ఛ... యిద్దారాడవాళ్లకి సమానంగా జీవితాన్నీ, ప్రేమనీ పంచుతానంటూ భుజాలు విరుచుకునే మగాళ్లని నడిరోడ్లో నిలబెట్టి కాల్చిపారేయాలి. ఈ సెకండ్ హ్యాండ్ మనిషి మాకొద్దంటూ ఆడవాళ్లు బహిష్కరించేయాలి...

జయా... జయా... అబ్బ ఆ పిలుపుతో పేగు కదిలింది... ఎట్లా వుంది? కరకర చప్పుడవుతోంది.

జయా ఎన్నో యుగాల తర్వాత విన్పించిందా గొంతు... జీవముండి తను తిరుగుతున్నంత కాలం అవసరం లేకుండాపోయింది. యిప్పుడీ మనిషి లేకుండా పోతోందని తెలిసి ఎంత ప్రేమ... ఎంత ప్రేమ... ఎంత ఆత్మీయత... అంతా నటన... నరుడి బతుకు నటన...

జయా...

తనకెందుకో కళ్లు తెరవాలన్పించలేదు.... జీవిత పర్యంతం నువు చూపిన నిర్లక్ష్యం నా హృదయ కవాటాల నిండా పేరుకుపోయి అదేదో అటాకన్నారు, స్ట్రోక్ అన్నారు... యిప్పుడు తీరా కేన్సరంటున్నారు... ఆ నిర్లక్ష్యాన్నంతా తట్టుకోవడం కోసం మరణాన్ని మందు అడుగుతున్న దానిలా పడివున్నానీ మంచం మీద.

అతడికేమీ విన్పించినట్టు లేదు.

జయా... ఎట్లా వుంది? అనంతమైన జాలి.

ఒక్కసారి చివరిసారిగా కళ్లు తెరిచి అతడికేసి చూసింది.

అతడి కళ్ల నిండా నీళ్లు.

వద్దు... వద్దు...

ఇక జన్మజన్మలకీ, ఏ జన్మలోనూ మొగుడిగా నాకు నువ్వొద్దు... నిజ్జంగా చెప్తున్నాను... జీవిత పర్యంతపు నా సేవకి ఫలితంగా నువ్వు నాకేదయినా యివ్వదల్చుకుంటే, నా చివరి కోరికేమిటని ప్రశ్నిస్తే... నేను నిన్ను ఒకే ఒక్కటడుగుతాను. వచ్చే జన్మ లోనేకాదు... యిక ఏ జన్మలోనూ యిద్దరాడవాళ్లకి జీవితాన్నీ, ప్రేమనీ, హృదయాన్నీ పంచకు...

అతడు బాగా పరిశీలించగలిగితే తన కళ్లల్లో ఈ భావాలు పట్టుకోగలిగి వుండేవాడు... తనకేదో అవుతోంది... ఒళ్లంతా బరువుగా... కాస్త తేలిగ్గా ఎక్కిళ్లు వస్తూ, పోతూ... గాలిగా తేలుతున్నట్లుగా... తన కళ్లు మూతలు పడనేలేదు... అలాగే నిశ్చలంగా నిలిచిపోయాయి... అతడి సమాధానం కోసం ఎదురుచూస్తున్నట్లుగా.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 7 నవంబర్ 1999*

